చిన్న కథ



# రాసిపెట్టిన పెళ్ళి

నిత్యానందం న్యూస్ పేపరు చదవడంలో మునిగి వున్నాడు. కాఫీ కప్పుతో వచ్చింది పెళ్లాం రాధమ్మ.

''మన సూర్యం పెళ్లి విషయంలో మా తమ్ముడు గోపాలం చెప్పిన దాని గురించి ఏమాలోచించారు?'' అడిగింది.

''ఆలోచించడానికేముంది. మీ తమ్ముడు కూతురు సునీతను సూర్యానికి చేసుకుంటామని మనం మాట ఇచ్చాం కదా!'' న్యూస్ పేపరు పక్కన పెట్టి, కాఫీకప్పు అందుకుంటూ అన్నాడు నిత్యానందం.

''మాట ఇవ్వడం గురించి కాదండీ. పై నెల శ్రావణ మాసంలో గోపాలం దాని పెళ్లి చేద్దామనుకుంటున్నాడు. అవతల మంచం పట్టిన మా అమ్మ పరిస్థితి ఇటో అటో అన్నట్లుగా వుంది. ఆవిడ కూడా తన కూతురి పెళ్లి చూడాలని తమ్ముడు తొందరపడుతున్నాడు''

''అయినా, నాకు తెలీక అడుగుతాను. కాటికి కాళ్లు చాచుకున్న ఆవిడకోసం పిల్ల పెళ్లికి తొందరపడటమేమిటి? దేనికైనా అర్థం వుండాలి''

''మీరలాగే అంటూ ఉండండి. సునీతకు వేరే సంబంధం చూసి పెళ్లి చేస్తారు''

''మనలో మన మాట. అసలు మన వాడు ఉద్యోగంలో చేరి ఆర్నెల్లు కూడా కాలేదు. వాడు అందులో నిలదొక్కుకుని నాలుగు డబ్బులు వెనకేసుకుని తన కాపరానికి కావల్సిన పెద్ద వస్తువులు ఏర్పరుచుకోవడానికి ఒక సంవత్సరమైనా పడుతుంది. అంత వరకు ఈ పెళ్లి ఆపితేనే వాడు సుఖపడతాడు''

''నేను మీకేం చెప్పలేను. మీరు చెప్పదల్చుకున్నదేదో మా తమ్ముడికి ఫోన్లో చెప్పండి'' అని కాఫీకప్పులు తీసుకుని వంట ఇంట్లోకి వెళ్లింది రాధమ్మ. నిత్యానందం మళ్లీ న్యూస్ పేపర్ తీసాడు. కాలింగ్ బెల్ మోగింది. వెంటనే రాధమ్మ వెళ్లి తలుపు తీసింది.

''ఏవండీ, వెంటనే రండి'' అని పెద్దగా కేక పెడుతున్నట్లుగా అరిచింది రాధమ్మ. ఏం ప్రమాదం ముంచుకొచ్చిందోనని న్యూస్ పేపరు సోఫాలో పడేసి నిత్యానందం కంగారుగా గుమ్మ దగ్గరకి వచ్చాడు. గుమ్మ బయట సూర్యం అతని పక్కన ఒక విదేశీ యువతి వుంది. ఇద్దరూ పూల దండలు వేసుకుని వున్నారు. సూర్యం తల్లిదండ్రులతో

''ఈమె పేరు మేరీ. ఒక అమెరికన్ లేడీ. కొంత మంది టూరిస్టులతో కల్సి మన దేశానికి వచ్చింది. మీరు మా పెళ్లికి అంగీకరించరని, రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసుకున్నాం అన్నాడు. రాధమ్మ పెద్దగా ఏడుస్తూ తెల్లబోయి శిలా విగ్రహంలాగా నిలబడి వున్న భర్తతో-

''ఏవండీ, అంతా అయిపోయింది. వాడికిష్టం వచ్చిన దాన్ని వాడు కట్టుకున్నాడు. ఇంక మన పెద్దరికమేముందండీ? దాన్ని మనింట్లో అడుగుపెట్టనివ్వను.'' అని తలుపు వేయబోయింది. సూర్యం వెంటనే-

''అమ్మా, నాన్నా, మీరు మా ఇద్దరిని ఇంట్లోకి రానివ్వరని నాకు తెల్సు. అందుకని నేను మా కాపరానికి వేరే ఇల్లు అద్దెకు తీసుకున్నాను. మీ కిష్టమైతే మమ్మల్ని చూడాలని వుంటే అక్కడికి రండి'' అని కచ్చితంగా చెప్పి ఆ అమెరికన్ అమ్మాయితో వెళ్లిపోయాడు.

గుమ్మం దగ్గర చతికిలబడి రాధమ్మ ఏడుస్తూనే వుంది. అప్పటికి నిత్యానందం తేరుకుని, ఆమెను లేవదీసి ''రాధీ, మనవాడు ఇంతపని చేస్తాడని నేనెన్నడూ అనుకోలేదు. జరిగిన దానికి బాధపడి ప్రయోజనం ఏముంది? ఇది విధి నిర్ణయం ప్రకారం వాళ్లిద్దరికి రాసి పెట్టిన పెళ్లి అని మనసును స్థిమితపరుచుకో'' అని ఓదార్చాడు.

– కె. శ్రీనివాసశాస్త్రి